# టైటిలిచ్చి దీవించిన నాన్నకు థాంక్స్



'ఉన్నన్ని రోజులూ నాతో సినిమాలు తీసి, హిట్లు ఇచ్చీ, నన్ను సక్సెస్‌ఫుల్ హీరోని చేశారు నాన్న. ఇప్పుడు భౌతికంగా లేకపోయినా.. ఆయన టైటిల్ ఇచ్చి నన్ను దీవిస్తున్నారు. ఇది బరువుగా, బాధ్యతగా భావిస్తున్నాను' అన్నారు అల్లరి నరేశ్. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఫరియా అబ్దుల్లా కథానాయిక. మల్లి అంకం దర్శకుడు. రాజీవ్ చిలక నిర్మాత. శుక్రవారం సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అల్లరి నరేశ్ ఇంకా మాట్లాడుతూ 'దర్శకుడిగా మల్లికి ఇది తొలి సినిమానే అయినా, అద్భుతంగా తీశాడు. 32మంది కొత్త దర్శకులతో పనిచేశాను. 31మంది విడుదలకు ముందు టెన్షన్ పడ్డారు. ఒక్క మల్లి మాత్రం చాలా కూల్‌గా నవ్వుతూ ఉన్నాడు. రాజీవ్ లాంటి నిర్మాతలు తెలుగు పరిశ్రమకు చాలా అవసరం. ఈ సినిమా పెద్ద విజయం సాధించి, మరో పది సినిమాలు ఆయన నిర్మించి పదిమందికి పని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని అన్నారు. సినిమాకు పనిచేసిన అందరికీ అతిథిగా విచ్చేసిన హీరో అడివి శేషు శుభాకాంక్షలు అందించారు. ఇంకా చిత్ర యూనిట్‌తోపాటు అతిథులుగా విచ్చేసిన దేవకట్టా, విజయ్ బిన్నీ, బీవీఎస్ రవి కూడా మాట్లాడారు.

# నోట్ల కట్టల కంటైనర్‌తో 'కుబేర'



'కుబేర' అనే పేరుకి తగ్గట్టుగా, కంటైనర్ నిండా నోట్ల కట్టలు. దాని ఎదురుగా వర్షంలో గొడుగుతో నాగార్జున. ఫస్ట్‌లుక్‌లోనే సినిమాపై, అందులోని నాగార్జున పాత్రపై ఆసక్తి రేకెత్తేలా చేశారు దర్శకుడు శేఖర్ కమ్ముల. ఈ లుక్‌లో నాగ్ స్టైలిష్‌గా, కాస్త ఏజ్డ్‌గా కనిపిస్తున్నారు. 'కుబేర' అన్న టైటిల్‌కి సరిగ్గా సరిపోయేలా ఉంది నాగ్ స్టిల్. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో నాగార్జునది ప్రత్యేక పాత్ర అని గతంలో వార్తలొచ్చాయి. కానీ ఈ ఫస్ట్‌లుక్ చూస్తుంటే టైటిల్‌రోల్ నాగార్జునే చేసినట్టు అనిపిస్తున్నది. ఏదేమైనా నాగార్జున లుక్ మాత్రం ఆయన అభిమానులు మెచ్చేలా ఉందని చెప్పక తప్పదు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, కెమెరా: నికేత్ బొమ్మి, నిర్మాతలు: సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు.

# వీరమల్లు సందడి షురూ



దొరల్ని కొట్టి, పేదలకు పెట్టే రాబిన్‌హుడ్ తరహా పాత్రలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. 'ధర్మంకోసం యుద్ధం' అనేది ఉపశీర్షిక. ఇది పవన్‌కల్యాణ్ నటిస్తున్న తొలి జానపద చిత్రం కావడం విశేషం. జాగర్లమూడి రాధాకృష్ణ(క్రిష్) దర్శకత్వంలో ఈ చిత్రం ఇప్పటికే 75శాతం పూర్తయింది. కాగా, మిగతా భాగాన్ని ఈ చిత్ర నిర్మాత ఏఎం రత్నం తనయుడు, దర్శకుడు అయిన జ్యోతికృష్ణ.. క్రిష్ పర్యవేక్షణలో పూర్తిచేయనున్నట్టు గురువారం టీజర్ విడుదల సందర్భంగా మేకర్స్ ప్రకటించారు. పవన్‌కల్యాణ్ కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా నిర్మిస్తున్నట్టు వారు తెలియజేశారు. తొలి భాగానికి చెందిన టీజర్‌ని గురువారం విడుదల చేశారు. 17వ శతాబ్దం నాటి కథగా రూపొందుతోన్న ఈ చిత్రం కోసం అప్పటి చార్మినార్, ఎర్రకోట, మచిలీపట్నం ఓడరేవు.. వంటి భారీ సెట్‌లను అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో నిర్మించారు. వీరమల్లుగా పవన్‌కల్యాణ్ సాహసాలు ఈ సినిమాలో హైలైట్‌గా నిలువనున్నాయని టీజర్ చెప్పకనే చెబుతున్నది. టీజర్‌లోని బలమైన సంభాషణలు, అద్భుతమైన విజువల్స్ సినిమాపై అంచనాలు పెంచేశాయి. మొఘల్ చక్రవర్తిగా బాబీడియోల్ నటిస్తున్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయిక. ఈ ఏడాది చివర్లో విడుదల కానున్న ఈ చిత్రంలో నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా పతేహి తదితరులు ఇతర తారాగణం. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్, వి.ఎస్.మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.

# కృష్ణమ్మతో సత్యదేవ్ స్టార్ కావాలి - రాజమౌళి



'కొరటాల శివ ఈ చిత్రాన్ని సమర్పిస్తుండటం ఇక్కడ స్పెషల్ అట్రాక్షన్. టీజర్, ట్రైలర్ తక్కువ షాట్స్‌లోనే ఎట్రాక్టివ్‌గా తీసి, సినిమా చూడాలనే ఉత్సాహాన్ని పెంచాడు దర్శకుడు గోపాలకృష్ణ. సరైన సినిమా పడితే స్టార్ అయ్యేంత మంచి నటుడు సత్యదేవ్. 'కృష్ణమ్మ'తో అది జరగాలని కోరుకుంటున్నా.' అని దిగ్దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అన్నారు. సత్యదేవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వి.వి.గోపాలకృష్ణ దర్శకుడు. కృష్ణ కొమ్మలపాటి నిర్మాత. ఈ నెల 10న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అతిథిగా హాజరైన రాజమౌళి పై విధంగా స్పందించారు. దర్శకులు మలినేని గోపీచంద్, అనీల్ రావిపూడి కూడా అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఈ చిత్ర సమర్పకుడైన దర్శకుడు కొరటాల శివ మాట్లాడుతూ 'కథ వినగానే ఈ ప్రాజెక్ట్‌లో నేనూ భాగం కావాలని అనిపించింది. అంత మంచి కథ. అందుకే నేను సమర్పకుడ్నయ్యా. గోపాలకృష్ణ చక్కగా తీశాడు. సత్యదేవ్ మంచి నటుడని రుజువు చేసే సినిమా ఇది. సాంకేతికంగా కూడా సినిమా అభినందనీయంగా ఉంటుంది' అని పేర్కొన్నారు. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ తన ప్రయాణంలో ఎన్ని మలుపులు తిరుగుతుందో, ఈ సినిమాలో కూడా అన్ని మలుపులు ఉంటాయని, కథ వినగానే ఇది వందకోట్ల కంటెంట్ ఉన్న సినిమా అనిపించిందని, అదే దర్శకుడికి చెప్పానని, ఈ సినిమాకు అన్నీ బాగా కుదిరాయని, అందరికీ నచ్చుతుందని సత్యదేవ్ చెప్పారు. ఇంకా చిత్రయూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

# తెరపై కొత్త ప్రపంచాన్ని చూస్తారు



'ఈ కథ కోసం రీసెర్చ్ చేసే క్రమంలో చరిత్రతో ముడిపడిన ఓ ఆశ్చర్యకరమైన సంఘటన గురించి తెలిసింది. అస్సామీ జానపదాల్లో 'బాక్' అనే దెయ్యం ఉండేదట. ఆ దెయ్యానికి చెందిన కొన్ని విషయాలు నన్ను సర్‌ప్రైజ్ చేశాయి. అక్కడే ఈ కథకు బీజం పడింది. అస్సామీ, బ్రహ్మపుత్ర ప్రాంతంలో ఉండే 'బాక్' అనే దెయ్యం మన ప్రాంతానికి వస్తే ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి? అనే ఆలోచనతో ఈ కథ రాశాను. ప్రేక్షకులకు ఓ కొత్త ప్రపంచాన్ని చూపించే సినిమా ఇది' అని సుందర్.సి అన్నారు. ఆయన నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'బాక్'. 'అరణ్మనై' సిరీస్‌లో ఇది నాలుగో సినిమా. తమన్నా భాటియా, రాశీఖన్నా కథానాయికలు. ఖుష్బు సుందర్, ఏసీఎస్ అరుణ్‌కుమార్ నిర్మాతలు. శుక్రవారం సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సుందర్.సి విలేకరులతో ముచ్చటించారు. 'అరణ్మనై' సిరీస్‌లో వచ్చిన మూడు సినిమాలూ పగ, ప్రతీకార నేపథ్యంలో ఉంటే, ఇది వాటికి భిన్నంగా ఉంటుంది. ఒక అద్భుతమైన ఎలిమెంట్ ఈ కథలో భాగంగా ఉంటుంది. విజువల్స్, మ్యూజిక్, లొకేషన్స్ అన్నీ డిఫరెంట్‌గా అనిపిస్తాయి. గత మూడు చిత్రాల మాదిరిగానే ఇందులో కూడా స్త్రీ పాత్రలు బలంగా ఉంటాయి. ఇందులో కొత్త తమన్నాను చూస్తారు. రాశీఖన్నా పాత్ర కూడా విభిన్నంగా ఉంటుంది' అని తెలిపారు సుందర్.సి. సవాలుగా తీసుకొని చేసిన సినిమా ఇదని, ఇందులో సీజీ వర్క్ అదిరిపోతుందని, విజువల్ వండర్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని ఆయన చెప్పారు. సురేశ్, ఏషియన్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థలు ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండటం ఆనందంగా ఉందని, హిందీలోనూ సినిమాను విడుదల చేస్తున్నామని, ప్రేక్షకాదరణ లభిస్తే 'అరణ్మనై 5' కూడా ఉంటుందని సుందర్.సి అన్నారు.

# ఛాలెంజ్‌గా తీసుకొని చేశా



'ఇందులో ఆర్జేగా నటించాను. మామూలు కుర్రాడి పాత్రే. అయితే తనకున్న ఫేస్ బ్లైండ్‌నెస్ వల్ల ఎలాంటి సమస్యల్లో ఇరుక్కున్నాడు? ఆ సమస్యలని ఎలా అధిగమించాడు? అనేది ఇందులో ఆసక్తికరమైన అంశం' అంటున్నారు నటుడు సుహాస్. ఆయన హీరోగా నటించిన చిత్రం 'ప్రసన్నవదనం'. పాయల్ రాధాకృష్ణ, రాశి సింగ్ కథానాయికలు. అర్జున్ వై.కె. దర్శకుడు. జె.ఎస్.మణికంఠ, టి.ఆర్.ప్రసాద్‌రెడ్డి నిర్మాతలు. శుక్రవారం సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సుహాస్ విలేకరులతో మాట్లాడారు. 'అర్జున్ చెప్పిన ఫేస్ బ్లైండ్ నెస్ కాన్సెప్ట్ చాలాబాగా నచ్చింది. ఆయన అనుకున్న స్క్రీన్‌ప్లే, సర్వైవల్ డ్రామా, క్లైమాక్స్ అదిరిపోయాయి. అందుకే కథ విన్న వెంటనే చేసేద్దామని ఫిక్స్ అయిపోను. ఈ పాత్ర కోసం పది రోజులు వర్క్ షాప్ చేశాను. దర్శకుడితో కూర్చుని పాత్ర గురించి, దాని ప్రవర్తన, పరిధుల గురించి తెలుసుకున్న తర్వాతే షూట్‌కి వెళ్లాను. ఇందులో యాక్షన్ సీక్వెన్స్‌నైతే సవాలుగా తీసుకొని చేశాను. ఫేస్ బ్లైండ్‌నెస్ ఉన్న పాత్ర కావడంతో ఆ సందర్భాల్లో ఎలాంటి ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వాలనేది ఛాలెంజ్‌తో కూడిన విషయమే. సుకుమార్‌గారి వద్ద ఎన్నో సినిమాలకు పనిచేసిన అనుభవం అర్జున్‌ది. అందుకే అద్భుతంగా తీశాడు.' అని తెలిపారు సుహాస్. తన 'కలర్ ఫొటో' సినిమాకు సహ నిర్మాతగా చేసిన మణికంఠ ఈ సినిమాకు నిర్మాత అని, కాబట్టి ఇది తన హోమ్ బేనర్ అని ఆయన అన్నారు. 'తొలికాపీ చూశాను. చాలా ఎమోషనల్‌గా అనిపించింది. ఇందులో కథానాయికలు పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్‌ల పాత్రలు కూడా కథలో చాలా కీలకంగా ఉంటాయి. కచ్చితంగా అందరికీ నచ్చే సినిమా ఇది' అని నమ్మకం వెలిబుచ్చారు సుహాస్.

# కౌసల్య తనయ రాఘవ



రాజేష్ కొంచాడా, శ్రావణి శెట్టి జంటగా నటించిన చిత్రం 'కౌసల్య తనయ రాఘవ'. స్వామి పట్నాయక్ దర్శకుడు. అడపా రత్నాకర్ నిర్మాత. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'నిజమైన ప్రేమకు అర్థం చెప్పే చిత్రమిది.1980 సంవత్సరం గ్రామీణ నేపథ్యంలో జరిగే అందమైన ప్రేమకథగా ఆకట్టుకుంటుంది. ప్రతి సన్నివేశం హృద్యంగా ఉంటుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: యోగి రెడ్డి, సంగీతం: రాజేష్ తేలు, నిర్మాణ సంస్థ: ఏఆర్ మూవీ మేకర్స్, ప్రొడ్యూసర్: అడపా రత్నాకర్, దర్శకత్వం: స్వామి పట్నాయక్.

# వేసవిలో నవ్వుల జల్లు



అభినవ్ గోమఠం టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'మై డియర్ దొంగ'. బీఎస్ సర్వాంగ కుమార్ దర్శకుడు. శాలినీ కొండెపూడి, దివ్యశ్రీపాద, నిఖిల్ గాజుల, వంశీధర్ గౌడ్ ముఖ్య పాత్రల్ని పోషించారు. క్యామ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై గోజల మహేశ్వర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ ఇటీవలే 'ఆహా' ఓటీటీలో విడుదలైంది. ఈ సందర్భంగా బుధవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. ఈ సినిమాలో అభినవ్ గోమఠం పండించిన కామెడీ అందరిని ఆకట్టుకుంటున్నదని, ప్రేక్షకులు ప్రతి సన్నివేశాన్ని ఎంజాయ్ చేస్తున్నారని నిర్మాత గోజల మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఓ మంచి సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉందని హీరో అభినవ్ గోమఠం అన్నారు. ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన వస్తున్నదని ఆహా మార్కెటింగ్ హెడ్ రాజశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# సందేశంతో 'సర్పంచ్'




ప్రేక్షక ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్న 'సర్పంచ్' చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో జట్టి రవి కుమార్ తెరకెక్కిస్తున్నారు. ప్రారంభోత్సవ వేడుకకు బోయినపల్లి హనుమంతరావు (జాతీయ స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల జాతీయ అధ్యక్షుడు) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత జట్టి రవికుమార్ చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఈ చిత్రాన్ని జూన్‌లో మొదలుపెట్టి వచ్చే ఏడాదికి పూర్తి చేస్తాం. విభిన్న కథాంశంతో తెరకెక్కించబోతున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో తెలియజేస్తాం' అన్నారు.








